ప్రజాశక్తి
ఆదివారం 3 డిసెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పార్వతీపురం : జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌ల్లో ఖాళీగా ఉన్న ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఒక అంగన్వాడి సహాయకుల పోస్టుతో పాటు బలిజిపేట ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడి కార్యకర్త, సహాయకుల పోస్ట్ లు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థినులు దరఖాస్తులను ఈనెల 5నుంచి 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 2023 జూలై 1 నాటికి 21-35 మధ్య వయసు కలిగి, స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత మహిళలు ఈ పోస్టులకు అర్హులని అన్నారు.

‘మిచాంగ్’ ముప్పు

కోతదశలో వరి • ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - కురుపాం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ మించాంగ్ తుపాను వాయుగుండంగా మారే సూచనలు కనిపిస్తున్నట్లు ప్రసారమాధ్యమాల్లో అధికారులు ప్రకటించిన నేపథ్యంలో రైతన్న గుండెల్లో గుబులు మొదలైంది. మండలంలో కోత దశలో ఉన్న వరి పంట చేతికొచ్చే సమయంలో తుఫాను వల్ల వర్షాలు కురిస్తే అపార నష్టం సంభవిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వరి పంటకు గడ్డు పరిస్థితని చెప్పవచ్చు. పంట ప్రాథమిక దశలో అనావృష్టి సంభవించడంతో రిజర్వాయర్లు, గెడ్డలు, చెరువుల కింద, బోర్లు నీటి వసతి కలిగిన వద్ద రైతులు సాగు చేపట్టారు. మెట్ట ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితి వల్ల పంటలు ఎండిపోయాయి. తీరా ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ గండం భయభ్రాంతులకు గురిచేస్తుంది. మండలంలో 23 పంచాయతీల్లో సుమారు 10717 ఎకారాల్లో వరి పంట సాగవుతుంది. దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ పంట పక్వానికి వచ్చి ఉంది. ఈనెల 3 నుంచి 6వరకు విపరీతమైన గాలిలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతున్నకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు గాలులు తోడైతే పంట మొత్తం నేలమట్టమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

రానున్న 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలు వాయిదా వేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి ఎస్ ఎస్ పాత్రో, వాతావరణ విభాగ శాస్త్రవేత్త కె.ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారి వాయువ్య దిశగా కదులుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతం దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరా ప్రాంతాలకు ఈనెల 4న విస్తరించి ఉన్నందున ఉత్తర కోస్తాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. కావున వరి కోతలను మూడు రోజులు పాటు వాయిదా వేసుకుని ప్రస్తుతం కోసి ఉన్న వరి కుప్పలను సురక్షిత ప్రాంతానికి తరలించే టార్పాన్లను కప్పు కోవాలని రైతులకు సూచించారు.

పాచిపెంట : తుపాను కారణంగా ఆదివారం నుంచి మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు పంటలను రక్షించుకునేందుకు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని మోసూరు, పాంచాలి, గురువునాయుడుపేట, తదితర గ్రామాల్లో తుఫానుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. విఎఎలు రైతులను కలిసి కోసి ఉన్న వరి పంటలను కుప్పలు వేయించారు. అలాగే వరి కోతలను మూడు రోజులపాటు వాయిదా వేసుకోవాలని, నీటి నిల్వను తట్టుకోలేని మొక్కజొన్న, పొగాకు పంటలకు దిగువ ప్రాంతంలో నీరు పోయేలా చిన్న కాలువలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఇప్పటికే వరి కొయ్యల్లో అపరాలు జల్లిన పొలాల్లో కూడా మొలకలు కుళ్లిపోకుండా డ్రైనేజీ కాలవ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తి, మొక్కజొన్న వంటి పంటల్లో తెగుళ్ల వచ్చే అవకాశం ఉన్నందున 500 గ్రాముల కాపరక్షక్ క్లోరైడ్, 200 గ్రాముల కార్బెండ జిమ్ పౌడర్ ను ఒక కేజీ మల్టీకేతో కలిపి పిచికారీ చేసుకుని 25 కిలోల యూరియాతో పాటుగా 15 కిలోల పొటాషియం మొక్కకు వేసుకోవడం ద్వారా అధిక వర్షాలు నుండి పంటలను రక్షించుకోవడమే కాకుండా స్థిరమైన దిగుబడిలు పొందొచ్చని తెలిపారు. అలాగే అందరూ విఎఎలు ఈ మూడు రోజులు పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కురుపాంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

పాచిపెంటలో తుపాను హెచ్చరికలో కోసిన వరిపంటను కుప్పలు పెడుతున్న రైతులు

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కలెక్టర్
- జిల్లా కంట్రోల్ రూమ్ నెంబరు 08963-293037, 7702003582

ప్రజాశక్తి - సీతానగరం

రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని సూరంపేట రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరికరాలు పరిశీలించారు. తూనిక యంత్రంపై ధాన్యం బస్తాను పెట్టి తూనికలను పరిశీలించారు. ధాన్యం తేమ శాతం తనిఖీ చేశారు. ధాన్యం రవాణా లారీకి జెండా ఊపి రవాణాకు శ్రీకారం చుట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2023-24 సీజనుకు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలో 185 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించామని చెప్పారు. రైతులు తాము పండించిన ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేలా చూడాలని, దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని ఆయన కోరారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ధాన్యం సేకరణ సహాయ ఏజెన్సీలకు అనుసంధానం చేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని కలెక్టర్ కోరారు. క్వింటాకు ప్రభుత్వం సాధారణ రకంకు రూ.2183, గ్రేడ్-ఏ రకానికి రూ.2203 నిర్ణయించిందని ఆయన చెప్పారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 8గంటల వరకు పని చేస్తుందని చెప్పారు. జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 08963-293037, 7702003582 నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్ నెంబరు 1800-4251967, రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబరు 1967 కూడా పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం డి నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి బి.రమణమ్మ, మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్, వైసిపి నాయకులు బొంగు రాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పార్ధసారథి, రైతులు పాల్గొన్నారు.

పెదభోగిలిలో ధాన్యాన్ని పరిశీలించిన జెసి

మండలంలోని పెదభోగిలిలో రైతు కల్లం వద్దనే ధాన్యం సేకరించి గోనె సంచుల్లో నింపి ట్రక్కుల్లో లోడ్ చేసే ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు పరిశీలించారు. ఈ గ్రామానికి చెందిన రైతు పల్ల శ్రీను లారీల్లో ఎక్కించిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి తుఫాను హెచ్చరికల కారణంగా బయట ధాన్యం ఉంచుకోవద్దని, త్వరితగతిన మిల్లులకు తరలించాలని తెలిపారు. అలాగే మిల్ వద్ద కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం అన్‌లోడ్ చేస్తారని తెలిపారు. అలాగే గోనె సంచులు ఎక్కడైనా అయిన తక్కువ ఉంటే వెంటనే పంపించాలన్నారు. ఏమైనా చిరిగిన గోనె సంచులు వస్తే వాటిని మళ్లీ వెనక్కి పంపించి కొత్తవి పంపిస్తున్నట్టు తెలిపారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో 32 టన్నుల ధాన్యం బస్తాలు కొనుగోలు చేసినట్లు ఎఒ జె.సౌజన్య తెలిపారు. ధాన్యం లారీకి ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు సర్పంచి ఎ.విజయమ్మ జెండా ఊపి ప్రారంభించారు. పనస నందివాడ గ్రామంలో 16 టన్నులు అడారిలో నాలుగు టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి పరిశి నాయుడు పాల్గొన్నారు.

ధాన్యం రవాణా లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

తుపాను పట్ల యంత్రాంగం అప్రమత్తం

- కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ - 08963 293046
- పార్వతీపురం ఆర్‌డిఒ కార్యాలయం కంట్రోల్ రూం ఫోన్ నెంబరు : 8500525011
- పాలకొండ ఆర్‌డిఒ కార్యాలయం కంట్రోల్ రూం ఫోన్ నంబరు: 9502722212
- అధికారులకు సెలవులు రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

మిచాంగ్ తుపాను పట్ల జిల్లా యంత్రాంగంగాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను అప్రమత్తం చేశారు. అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పి, సిహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆయన ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ - 08963 293046 ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురం ఆర్‌డిఒ కార్యాలయం కంట్రోల్ రూం 8500525011, పాలకొండ ఆర్‌డిఒ కార్యాలయం కంట్రోల్ రూం 9502722212 ఏర్పాటు చేశామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. అవసరం మేరకు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రజలను, సరుకులను తరలించేందుకు అవసరమైన ఇంధనం కోసం పెట్రోల్ బంక్‌లను అనుసంధానం చేయాలని ఆయన ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహార సరఫరాకు ఏర్పాట్లు ఉండాలని, ఎంఎల్ఎస్ పాయింట్లు అనుసంధానం చేయాలని ఆయన ఆదేశించారు. మధ్యాహ్న వంట ఏజెన్సీలను సిద్ధం చేయాలని అన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలను దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమగు పాలు, బిస్కెట్లు, రొట్టెలు తదితర సామాగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. పంటలను కాపాడుకొనుటకు రైతాంగాన్ని అప్రమత్తం చేయాలని వ్యవసాయశాఖను అదేశించారు. ఇప్పటికే కోసిన వరి పంట సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రోడ్లపై చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే చెట్లను తొలగించుటకు అవసరమగు పరికరాలు, అందుకు కావలసిన మెషినరీ, కట్టర్స్, జె.సి.బిలు సిద్ధం చేసి తక్షణ చర్యలు చేపట్టుటకు వీలుగా వివిధ మండలాల్లో ఉంచాలని ఆర్ అండ్ బి, అగ్ని మాపక విపత్తుల శాఖను ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. మత్స్య శాఖ దేశీయ మత్స్యకారులకు సూచనలు చేయాలని ఆయన ఆదేశించారు. గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. విద్యుత్ అంతరాయం వలన కమ్యునికేషన్ వ్యవస్థకు అంతరాయం కలిగే అవకాశం ఉందని, సంబంధిత టెలి ఆపరేటర్లు ముందస్తు ఏర్పాట్లు చేసి అంతరాయం కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. తుపాను, వరదల అనంతరం పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మునిసిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు మేరకు ప్రస్తుతం ఆగ్నేయ దిశగా నెల్లూరు దగ్గరలో ఉందని, వాయువ్య దిశగా పయనించే అవకాశం ఉందని తద్వారా రెండు, మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన అన్నారు. సంబంధిత అధికారులు వారు తీసుకున్న చర్యలను వివరించారు. 27 రహదారి క్లియరెన్స్ బృందాలు ఏర్పాటు చేశామని జిల్లా ప్రధాన అగ్ని మాపక అధికారి కె. శ్రీను బాబు, ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. సమావేశంలో జెసి ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, కెఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవనాయుడు, వివిధశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌పి విక్రాంత్ పాటిల్, డివిజనల్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్‌నిశాంత్‌కుమార్

తుపాను పట్ల అప్రమత్తం

సాలూరు రూరల్ : తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని కొత్తవలసలో పర్యటించారు. ఆయన ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, విద్యాశాఖ, విద్యుత్, పౌర సరఫరాలశాఖ, ఆర్ అండ్ బి తదితర శాఖలు అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయిలో ఉన్న పంటను సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించామన్నారు. పెదపెదం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించొద్దని హితవు పలికారు. ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు ధాన్యం తేమ శాతం, ఇతర అంశాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

రైతుల్ని అప్రమత్తం చేయాలి : డిప్యూటీ సిఎం

సాలూరు: భారీ తుపాను నేపథ్యంలో అధికారులు రైతులను అప్రమత్తం చేయాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాల పై ఎక్కువగా ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరి కోతలు కోస్తే సమయంలో వర్షాలు పడితే రైతులు నష్టపోయే అవకాశం ఉందని, అలా జరగకుండా వారిని అప్రమత్తం చేయాలన్నారు. తుఫాన్ ప్రభావం చూసే వరకు వరి కోతలు కోయకుండా రైతులు చూడాలని కోరారు. ఒకవేళ కోత కోస్తే వర్షాలకు దెబ్బతినకుండా మడుల్లోనే దిబ్బలు వేసుకోవాలని సూచించారు. రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలిచ్చి వరి కోతలు కోయకుండా నివారించాలని రాజన్నదొర కోరారు.

ఆడుదాం... ఆంధ్ర లోగాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

క్రీడా నైపుణ్యం వెలికితీయడమే ధ్యేయం

బ్రోచర్ ఆవిష్కరణలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాలు వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. శనివారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన బ్రోచర్లు, విజేతలకు అందజేసే పతకాలను ఆయన ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, డబుల్ బాడ్మింటన్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో టోర్నమెంట్లను నిర్వహించనున్నారని చెప్పారు. 15ఏళ్లు పైబడిన వారంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు. నియోజకవర్గ పోటీల్లో విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో, జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అన్ని స్థాయిల్లోనూ విజేతలకు నగదు బహుమతులు వుంటాయని చెప్పారు. పతకాలు, నగదు బహుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12కోట్లు ఖర్చు చేయనుందని చెప్పారు. ఆసక్తి కలిగిన యువకులు సచివాలయాల్లో గానీ, 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి గాని పేర్లు నమోదు చేసుకోవచ్చునని కోరారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆడుదాం ఆంధ్రా గురించి విస్తృతంగా ప్రచారం చేసి ఎక్కువ మంది యువకులు పాల్గొనేలా చూడాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎంపిడిఒ జి.పార్వతి పాల్గొన్నారు.

సీతంపేట : ఆడుదాం ఆంధ్ర క్రీడలో పగడ్బందీగా నిర్వహించాలని ఎంపిడిఒ కె.గీతాంజలి ఉన్నారు. స్థానిక ఐకెపి కార్యాలయంలో శనివారం వాలంటీర్లు పిఇటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆడదాం ఆంధ్ర పై అవగాహన కల్పించాలన్నారు వారిని గుర్తించి ఆడదాం ఆంధ్ర నిబంధనలు తెలియజేసి క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రైల్వే భారత్ గౌరవ్ యాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఇండియన్ రైల్వే భారత్ గౌరవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9 నుంచి 17వరకు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ చేపట్టే పుణ్యక్షేత్ర తీర్థ యాత్రను సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సిటిసి ఏరియా మేనేజర్ చంద్రమోహన్ కోరారు. శనివారం బెలగాంలో గల రైల్వే స్టేషన్లో స్టేషన్ మాస్టర్‌తో కలిసి భారత్ గౌరవ రైలు యాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ గౌరవ ట్రైన్స్ ఇక్కడి నుంచి ఇప్పటికి 9 రైళ్లు వెళ్లాయన్నారు. ఈ నెల 9న 10వసారి గౌరవ్ యాత్ర పేరుతో ట్రైన్ బయలుదేరిందని చెప్పారు. ఈ ట్రైన్ సికింద్రాబాద్‌లో బయలుదేరి పెందుర్తి వస్తుందని, పెందుర్తికి రాత్రి 11.30నిమిషాలకు చేరుకోవడం, అక్కడ నుంచి నేరుగా విజయనగరం రాత్రి 12.15నిమిషాలకు చేరుకుంటుందన్నారు. ఈ ట్రైన్‌లో 8రాత్రులు, 9పగలు ప్రయాణం ఉంటుందన్నారు. పుణ్యక్షేత్ర యాత్ర పూరీ, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగ వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రయాణించే వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి టిఫిన్స్ ఐఆర్సిటిసి కల్పిస్తుందన్నారు. అలాగే స్టేషన్ నుంచి ఏ దేవాలయానికి చేరుకోవాలన్నా ప్రయాణికులకు ఏసీ లేదా నాన్ ఏసీ ఏది బుక్ చేసుకుంటే ఆ బస్సుల్లో తీసుకువెళ్లడం జరుగుతుందని అన్నారు.



రైలు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఇదేమి సామాజిక న్యాయం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సామాజిక సాధికార యాత్ర పేరిట ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఒకింత అసౌకర్యాన్ని కలిగించాయి. చాలా మంది తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. సామాజిక న్యాయం పేరిట బలప్రయోగాలు, అధికార దుర్వినియోగాలు సృష్టిస్తున్నారని జనం మండిపడుతున్నారు. వైసిపి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సుయాత్ర గడిచిన రెండు నెలల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తయింది. ఈ యాత్ర ఎంతో విజయ వంతమైందని, జనం తండోపతండాలుగా వచ్చేశారని జిల్లా స్థాయి నాయకులు చెప్పుకుంటున్నారు. కానీ, వచ్చినవారంతా మనవారు కాదంటూ మండల, గ్రామ స్థాయి వైసిపి నాయకుల నోట వినిపిస్తున్న మాట. ఇటువంటివారిలో ప్రభుత్వ విధానాలు మింగుడు పడనివారు కొందరైతే ఎమ్మెల్యేల తీరు నచ్చనివారు మరికొందరు ఉన్నారు. ఫొటోల కోసం ఏకంగా మొక్కలు, చెట్లు కూడా నరికివేయడం పట్ల సొంత పార్టీ నుంచి కూడా సర్వత్రా విమర్శలు వెల్లువిరుస్తున్నాయి. పార్వతీపురం పట్టణంలో జరిగిన సామాజిక యాత్రకు ముందు రోజు రాత్రి ప్రధాన రహదారిపై ఉన్న చెట్లను నరికివేశారు. బొబ్బిలి మిగిలిన పట్టణ ప్రాంతాల్లో కూడా ఇదే రకమైన వైఖరి ప్రదర్శించారు. దీంతో, ఆయా పట్టణాల్లోని ప్రజలు, ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురంలో మొక్కల నరికివేతపై చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఓట్లు, రాజకీయాల కోసం పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పాడుచేశారంటూ పబ్లిక్ టాక్ నడుస్తోంది. బలప్రదర్శన కోసం చేసిన ఈ పని ఎన్నికల్లో వైసిపి గట్టి దెబ్బ తగిలిస్తుందని కూడా చర్చ జరుగుతోంది. ఇటీవల నెల్లిమర్లలో జరిగిన సాధికార యాత్ర సందర్భంగా ఉదయం నుంచే చీపురుపల్లి రహదారిలో మొయిద జంక్షన్ వద్ద వాహనాలను స్తంభింపజేశారు. ఈ రోజు ప్రయాణికులు, వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. దాదాపు అన్ని సభలలోనూ జనాల్లో చర్చనడిచేందుకు అధికార పార్టీ ఇదే రకమైన వ్యూహం చేపట్టినట్టుగా జనం చెప్పుకుంటున్నారు. ఈ వ్యూహం వైసిపి పట్ల సానుకూలంగా ఉన్న జనాలను సైతం బాధించడం గమనార్హం. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారడంతో జనాలు సకాలంలో ఇళ్లకు చేరుకోలేకపోయారు. ఇక బొబ్బిలి సాధికార యాత్ర సభ మధ్యలోనే జనాలు వెనుదిరగడంతో ఉమ్మడి జిల్లాలతో పాటూ సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర మంత్రా చర్చ నడిచింది. ఇక జనాలు కేవలం సంబంధిత నియోజకవర్గాలకే పరిమితం కాలేదు. పక్కపక్క నియోజకర్గ జనాలు కూడా సభల్లో పాల్గొన్నారు. ఇటువంటివారిలో ఎక్కువ మంది రాజకీయాలపట్ల అంత ఆసక్తి లేనివారు, బొత్తిగా రాజకీయాలు లేనివారు కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. అందుకు తగ్గట్టే జనం ఎక్కువగా వచ్చారనే భావన కలిగించడం కోసమూ, ఒక వేళ అనుకున్నంత జనం రాకపోతే ఫెయిలవుతామనే భయంతోనూ సంబంధిత ఎమ్మెల్యేలు ఇటువంటి జంబ్లింగ్ విధానం అనుసరించారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సభల్లో కేవలం పథకాలు గురించి చెప్పడం, పార్టీ అధినేతను పొగడడం తప్ప, పరిష్కరించలేకపోయిన సమస్యల గురించి ఎక్కడా చర్చ జరగలేదు. వీటన్నింటికన్నా సభలకు హాజరైన మంత్రులు పాడిందే పాడినట్టు ప్రతిపక్ష పార్టీ, నాయకులను తిట్టడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని జనం చర్చించుకుంటున్నారు.

రాజన్న దొరకు వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

రైలుబండి రాకపోకల సమయాలను మార్చాలి

డిప్యూటీ సిఎంకు నాయకుల వినతి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి త్వరలో రానున్న రైలు బండి రాకపోక సమయాల్ని మార్పు చేయాలని కోరుతూ డిప్యూటీ సిఎం రాజన్నదొరను పట్టణ, మండల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వారు డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి రాత్రి సాలూరు వచ్చి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు బయలుదేరేలా సమయాన్ని నిర్ణయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 6గంటలకు బయలు దేరేలా సమయాన్ని మార్చాలని కోరారు. అలాగే బొబ్బిలి, సాలూరు మధ్య గతంలో నడిచిన రైలు బస్‌ను తిరిగి నడపాలని కోరారు. బొబ్బిలి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులకు రైలు బస్సు సౌకర్యం గా వుండేదని చెప్పారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి రైలు బండి సమయాలను మార్చేలా చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ, సామాజిక కార్యకర్త కె.తవిటినాయుడు కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. జగనన్న కాలనీ లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ఈనెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు కావాల్సిన సామాగ్రిని కూడా అందిస్తున్నామన్నారు. లబ్ధిదారులు ప్రత్యేకంగా శ్రద్ధ వహించి ఇళ్ల పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ జానకీరామ్ ఇన్‌స్పెక్టర్లు పి.కృష్ణ, సిహెచ్ సత్యనారాయణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు శిష్టకరణాల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురంతో పాటు కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన శిష్టకరణం కుటుంబాల ఆత్మీయ కలయిక (పిక్నిక్) సీతారాంపురం తోటలో, ఆర్కిటెక్చర్ కాలేజీ బస్సు స్టాప్ వద్ద ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బలగం జయబాబు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి, సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. పిల్లలకు ఆటలు, పాటలు, డాన్స్, పోటీ కార్యక్రమాలు, వివాహ పరిచయ కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని, వనసమారాధనలో భాగంగా ఈ కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

4నుంచి సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 4 నుంచి 9 వరకు గుమ్మలక్ష్మీపురం మండల సచివాలయ ఉద్యోగులకు, గ్రామ వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాల్మన్ రాజు తెలిపారు. ఈ శిక్షణకు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

10న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఇంటింటా జెఎఎస్ ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని బందులుప్పి పిహెచ్‌సి పరిధిలోని వెంకంపేటలో ఎఎన్ఎం జిఎం రత్నం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటా ప్రచారం శనివారం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.

భారీ వాహనాలను మళ్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పట్టణానికి రింగ్ రోడ్ అవసరం ఉందని జనసేన పార్టీ నాయకులు. చందక అనిల్, రాజాన రాంబాబు, నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీ, మానేపల్లి ప్రవీణ్, హర్ష, గోపీసెట్టి రంగారావు అన్నారు. ఈ మేరకు వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ భారీ వాహనాల రాకపోకలు పట్టణంలో ఎక్కువ కావడంతో బైపాస్ రోడ్ ఫ్లైఓవర్ నుంచి పాత బస్టాండ్, అలాగే రాయగడ రోడ్ వైపుగా భారీ వాహనాలు వెళ్లడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే పార్వతీపురం జిల్లా కావడంతో చుట్టుపక్కల మండలాల ప్రజలు పట్టణానికి రావడంతో ట్రాఫిక్ పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రింగ్ రోడ్ ఏర్పాటుపై అధికారులు దృష్టిసారించాలని కోరారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బందలుప్పిలో శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన శంకరాపు కౌసల్యమ్మ అనే మహిళకు చెందిన పూరిల్లు కాలిపోయింది. వ్యవసాయకూలీ పనులు నిమిత్తం వరికోతలకు వెళ్లిన ఆమె ఇంటిలో మంటలు చెలరేగడంతో స్థానికులు స్పందించి అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదం వల్ల రూ.25వేలు వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు స్థానికులు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వైసిపి యువజన నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధి కొండపేట (2,3వ వార్డు)కు చెందిన కార్యకర్త ఇటీవల జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు తనయుడు యువజన నాయకులు బడ్డు కొండ ప్రదీప్ నాయుడు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి రూ. 15వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ నాయుడు మాట్లాడుతూ గాయపడ్డ కార్యకర్తను ఆదుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, 2వ వార్డ్ కౌన్సిలర్ పైల భారతి, 3వ వార్డ్ కౌన్సిలర్ మొయిద శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పైల మురళి, సోషల్ మీడియా కన్వీనర్ పైల గణేష్, పాలూరి వాసు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అంగన్‌వాడీల న్యాయమైన సమ్మెకు అన్ని వర్గాలూ సహకరించాలని సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల సూరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్మిక అమర వీరుల స్మారక భవనంలో అంగన్ వాడీల సమ్మె కర పత్రాలు వామ పక్ష ప్రజా సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్ వాడీలు సమ్యస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8 నుంచి సమ్మెకు దిగుతున్నారని తెలిపారు. న్యాయమైన సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

రాళ్లు తేలిన రుక్మిణిగూడ రహదారి

ప్రజాశక్తి - సీతంపేట

మండల ంలోని రుక్మిణిగూడ రహదారి రాళ్లు తేలి ఉండడంతో గిరిజనులు నాన అవస్థలు పడుతున్నారు. గిరిజనులు కనీసం అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వెంటనే రహదారి మంజూరు చేయాలని గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు.

రాళ్లు తేలిన రహదారి..

ఓటు హక్కును వినియోగించుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - పాలకొండ

ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శనివారం పాలకొండలో ఓటరు నమోదుపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పిఒ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఓటుతోనే మార్పు సాధ్యమవుతుందన్నారు. మన భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాలకొండ తహసీల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని కొత్తవలసలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఇవిఎంల డిమానిస్ట్రేషన్‌ను పార్వతీపురం ఐటిడిఎ పిఒ, సాలూరు నియోజక వర్గం ఓటరు నమోదు అధికారి సి.విష్ణు చరణ్ శనివారం పరిశీలించారు. ఫారం 6, 7, 8 వివరాలను అడిగి తెలుసుకున్నారు. యువత ఓటు హక్కు వినియోగించుకోవాలని అందుకు ఓటరుగా నమోదు కావాలని అన్నారు. ఇవిఎంల డిమానిస్ట్రేషన్ ఏర్పాటు చేశామని, ఓటర్లు తమ ఓటు ఏవిధంగా నమోదవుతుందో పరిశీలించవచ్చని ఆయన చెప్పారు.

పాలకొండ: ర్యాలీ చేస్తున్న పిఒ, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: ఓటరు జాబితాను పరిశీలిసున్న సర్పంచ్

కొత్తవలస ఆశ్రమ పాఠశాల తనిఖీ

కొత్తవలస ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల చదువు, బోధనను పరిశీలించారు. చక్కగా చదివాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. రూఫ్ హార్వెస్టింగ్ కట్టడాలను తనిఖీ చేసి వాటి వినియోగం పట్ల శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓటు నమోదు సవరణకు నేడే ఆఖరు

మక్కువ : మండలంలోని 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటు నమోదు, సవరణ చేసుకునేందుకు ఆదివారంతో గడువు ముగియనుందని స్థానిక తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని 53 మంది బూత్ లెవెల్ ఆఫీసర్ల ద్వారా ప్రత్యేక కేంపెయిన్ నిర్వహించామన్నారు. ఈ మేరకు శనివారం 238 మందికి సంబంధించిన వివరాలు అందాయన్నారు. గడువులోగా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని ఎల్విన్‌పేట సర్పంచి ఆర్ చైతన్య స్రవంతి కోరారు. ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఎల్విన్‌పేటలో గల 76, 77 నెంబర్ల బూత్‌లను ఆమె చేసి ఓటరు జాబితాను పరిశీలించారు. చనిపోయిన ఓటర్లను తొలగించాలని, కొత్తవారిని చేర్పించాలని కోరారు. 2, 3 తేదీల్లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఓటు యొక్క ప్రాధాన్యత వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్యామల, విఆర్ఒ అమర ఉన్నారు.

ఇవిఎం పనితీరు పరిశీలన

పార్వతీపురం: ఇవిఎంలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

సాలూరు: ఇవిఎంలను పరిశీలిస్తున్న పిఒ

పార్వతీపురం : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం) పనితీరును ఓటర్లు పరిశీలిస్తున్నారు. ఇవిఎం పనితీరు ప్రదర్శన (డిమానిస్ట్రేషన్)ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఇవిఎంలో ఓటు వేసి అది ఏ విధంగా నమోదైందో ఓటరు పరిశీలించేందుకు వీటిని జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సహా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేశారు. మొబైల్ ఇవిఎం డిమానిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు ఇవిఎం డిమానిస్ట్రేషన్, మొబైల్ ఇవిఎం డిమానిస్ట్రేషన్ ఏర్పాటైంది. ప్రతి ఓటరు ఓటు వేసి తన ఓటు వేసిన గుర్తుకు పడిందా లేదా తనిఖీ చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనుల కోసం, సమావేశాల కోసం వస్తున్న ఓటర్లు తనిఖీ చేసుకుంటున్నారు. అటువంటి వ్యక్తులకు ఓటు వినియోగంపై అవగాహన కూడా కల్పిస్తున్నారు. శనివారం పలువురితో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు ముఖాముఖి మాట్లాడి ఓటు ప్రక్రియ ముఖ్యంగా ఇవిఎం ద్వారా ఓటు విధానాన్ని వివరించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- దెంకాడ

స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత పారద ర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపటడుతుం దన్నారు. ధాన్యం కనీసం మద్దతు ద్వారా క్వింటాకు సాధారణ రకం రూ.2183గా నిర్ధారించినట్లు వెల్లడిం చారు. ధాన్యం మద్దతు ధరతో పాటు గోని సంచులు, లేబరు, రవాణా చార్జిస్ 21 రోజుల్లో రైతుల ఖాతాకు జమ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యం వాహనాలలో ఎగుమతి చేసిన దగ్గర నుండి మిల్లు వద్ద దిగుమతి అయ్యేవరకు జిపిఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేస్తారన్నారు. వాహన యజమానులు తమ వాహనాలకు జిపిఎస్ పరికరాన్ని తప్పనిసరిగా అమర్చి రవాణా చేయాలన్నారు. ధాన్యం అమ్మదలిచిన రైతులు బయోమెట్రిక్ విధానం ద్వారా ధాన్యం అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి సత్య వెంకట వాసుదేవ, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, గ్రామ సర్పంచ్ పతివాడ గౌరీ, సబ్ డివిజనల్ లెవెల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ విజయ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల నిధులు దోచేశారు..

గంట్యాడ: పంచాయతీలకు కేటాయించిన నిధులను సర్పంచులకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం మళ్లించి మోసం చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో శనివారం నియోజకవర్గం స్థామి సర్పంచులు, మాజీ సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చిన రూ. 8,629 కోట్లను మళ్లించి తన సొంత అవసరాలకు వాడుకుందన్నారు. చెక్కుల మీద సర్పంచుల సంతకాలు లేకుండా సర్పంచులకు కనీసం సమాచారం ఇవ్వకుండా సిఎఫ్ఎంఎస్ ఖాతాల నుంచి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపించారు. పంచాయతీ నిధులు మళ్లింపుపై ప్రస్తుత, మాజీ సర్పంచు లంతా గ్రామ వికాసం పేరిట గ్రామాల్లో ప్రచారం చేసేందుకు సిద్ధమవు తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా సర్పంచులంతా పాల్గొని నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తు న్నారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10న శ్రీకాకుళం, 11 కాకినాడ, 14 నరసారావుపేటలో సమావేశాలు నిర్వహిస్తామని ఈ సమావే శాలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని స్పష్టం చేశారు. ప్రభుత్వం సర్పంచులకు చేస్తున్న ద్రోహంపై పోరాటానికి ప్రస్తుత, మాజీ సర్పంచులంతా సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు స్వామినాయుడు, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, మాజీ సర్పంచులు బాస్కరనాయుడు, అల్లు విజయ, నియోజకవర్గం సర్పంచుల సంఘం ఇంచార్జి సత్యవతి పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లా 185 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు ప్రకటించినప్పటికీ వాస్తవానికి రైతుల నుంచి ఒక్క ధాన్యం బస్తా కదలని పరిస్థితి మండలంతో పాటు జిల్లాలో నెలకొందని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అన్నారు. మండలంలోని అడ్డాపుశిల, బంటువానివలస, కోటవానివలస రైతులు ధాన్యం కళ్లాల దగ్గర శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్ ప్రారంభమై నెలరోజు కావస్తున్నా అధికారులు, మిల్లర్ల మధ్య సంప్రదింపులు సాగక పండించిన పంట కళ్లాలోనే ఉంచుకొనే పరిస్థితి రైతులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనికి తోడు తుఫాన్ హెచ్చరికలు అందడంతో కర్షకులు బెంబేలెత్తుతున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెపుతున్నారే తప్ప ఎక్కడా కొనుగోళ్లు చేయడం లేదన్నారు. అంతేకాకుండా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని సిద్ధం చేసినప్పటికీ మిల్లర్లు తేమ శాతాన్ని సాకుగా చూపి, రైతుల దగ్గర నుండి బస్తాకు 5కేజీల ధాన్యం ఎక్కువగా తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే తగు చర్యలను ప్రారంభించి, రైతులకు ఏవిధమైన నష్టం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నిరసన తెలుపుతున్న రైతులు

బాబుతోనే ప్రజల భవిష్యత్తుకు భరోసా

ప్రజాశక్తి - కురుపాం

చంద్రబాబుతోనే ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలోని గుజ్జువాయి గ్రామపంచాయతీ పరిధిలో గల మంటికొండ, చిన్నంటి జోల, డేరింగుపాడు, నేరేడుమనుగూడ, మర్రిమానుగూడ గిరిజన గ్రామాల్లో బాబు సూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రజలకు ఇవ్వనున్న భరోసా కార్యక్రమాలు గూర్చి వివరించి రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.



కురుపాం: మినీ మేనిఫెస్టోను వివరిస్తున్న జగదీశ్వరి

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హెచ్. సుబ్బలక్ష్మి , మాజీ జిల్లా కోప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, యూనిట్ ఇన్చార్జులు నాగేశ్వరరావు, గౌరీశంకర్, బి.యువరాజు, పి.రమేష్. బి. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని ఎలిశపురం, సంధిమానుగూడ గిరిజన గ్రామాల్లో పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబు గ్యారంటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి డి సుందర్రావు, నాయకులు కె.అప్పారావు, నగేష్, సోమేష్ తదితర గిరిజనులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: నాలుగున్నరేళ్ల వైసిపి అసమర్థపాలనలో వెనుకబడిపోయిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కేవలం తెలుగుదేశంపార్టీతోనేనని పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో శనివారం నిర్వహించిన బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగురోడ్ల కూడలి, బందంవారివీధి, దేవాంగుల వీధితో పాటుగా వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో ప్రతి షాపునకు వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ, టిడిపిని అధికారంలోకి తీసుకొస్తే అమలు చేయబోయే పథకాలను కరపత్రం అందిస్తూ వివరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, పట్టణ అధ్యక్షకార్యదర్శులు, జి.రవికుమార్, మజ్జి వెంకటేష్, సీనియర్ నాయకులు బర్నాల సీతారాం, కోలమధు, బోను చంద్రమౌళి, పోల సత్యనారాయణ, డాక్టర్ జి.భానుప్రసాద్, హనుమంతు శంకరరావు, పి.మరియదాసు, రాజశేఖర్, జనసేన నాయకులు చందక అనిల్, ఎన్.సురేష్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టిఫెన్ దుకాణం వద్ద ఉల్లిపాయలు కోస్తున్న విజయచంద్ర

భూ యజమానికి హక్కు పత్రంతో మేలు

ప్రజాశక్తి- రేగిడి

భూ యజమానికి హక్కు పత్రంతో ఎంతో మేలు అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో భూ సమస్యలకు పరిష్కారం పేరుతో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా స్వాధీనంలో ఉన్న భూములను శాశ్వత హక్కును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కల్పించారన్నారు. ఈ పట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, సంకిలిలో 55 మందికి 19.88ఎకరాలు, వంగర మండలంలో ముగ్గురికి 0.96 సెంట్లు భూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, వైస్ ఎంపిపిలు అచ్చెం నాయుడు, జగన్, తహశీల్దార్ సుదర్శన్ రావు, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఒ గోవిందరావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జెజెఎం పనుల పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ కురుపాం సబ్ డివిజన్ డిఇ కె.నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పనులను పరిశీలించి ఆర్డబ్ల్యుఎస్, గ్రామ సచివాలయ సిబ్బందికి తగు మేరకు సూచనలు, సలహాలు అందించారు. ప్రతిరోజూ రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను పరిశుభ్రపర్చి క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు మంచినీర ందించే ఏర్పాట్లు చేయాలని అన్నారు. అలాగే రక్షిత మంచినీటి ట్యాంకులు చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే సోలార్‌తో నడిచే మోటార్లు ప్రతిరోజు బ్యాటరీలు చార్జింగ్ అవుతున్నాయా లేదా పరిశీలించుకోవాలని అన్నారు. ఈ మేరకు ఆయన బాలేసు పంచాయితీ కొర్లగూడ, ఇరిడి పంచాయతీ, తంభం గూడ గ్రామాలను పరిశీలించారు. రక్షిత మంచినీటి ట్యాంకులు మరమ్మతులకు లోనైతే సచివాలయ సిబ్బందికి గానీ, తమ సిబ్బందికి గాని తక్షణమే సమాచారం అందిస్తే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డిఇ నాగేశ్వరరావు

సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ లక్ష్యం

ప్రజాశక్తి- చీపురుపల్లి

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పూడి రామ్మోహన్ అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల మహాసభలు చీపురుపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం అనే లక్ష్యాలతో 1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై ఎన్నో అలుపెరుగని పోరాటాలు చేసిందని వివరించారు. ఎస్ఎఫ్ఐ ఒక సమస్యను తెలుసుకుందంటే అది పరిష్కారమయ్యేంత వరకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్థులు పక్షాన పోరాడుతోందన్నారు. మండలంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలపై, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పనకై, డిగ్రీ కళాశాలలో మంచినీటి సదుపాయం కోసం, ప్రైవేటు జూనియర్ డిగ్రీ కళాశాలలో ఫీజులు దోపిడీకి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలను చీపురుపల్లి మండల కమిటీ చేసిందని ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ రానున్న కాలంలో మరిన్ని పోరాటాలు రూపొందించి విద్యార్థుల పక్షాన పోరాడడానికి నూతన మండల కమిటీని మండల మహాసభ ఏకగ్రీవంగా ఎన్నికుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటాల ఆటుపోట్లను, లోటుపాట్లను తెలుసుకోవడం, చర్చించడం కోసం, భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేసుకోవడం కోసం 31వ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నెల్లిమర్ల కేంద్రకంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం వెంకటేష్ పాల్గొన్నారు.

సుందరీకరణకు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ సుందరీకరణకు ప్రత్యేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని బెలగాం ప్రాంతం 20, 21వ వార్డులకు సంబందంచిన ప్రధాన రహదారి అయిన చర్చ్ సెంటర్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజల వినతులు మేరకు సుమారుగా రూ.70 లక్షల నిధులతో సీసీ రహదారి, కాలువల నిర్మాణం పనులను నాణ్యతా ప్రమాణాలతో శరవేగంగా పూర్తి చేసి పట్టణ ప్రజల సేవలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఏ ఒక్క అవకాశం లభించినా సరే పార్వతీపురం పురపాలక సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బి గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేస్వర రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ పి రామప్పలనాయుడు, వివిధ వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఆర్మీ ఉద్యోగి నుంచి రూ.17 లక్షలు దోచేశారు

విదేశీ ప్రయాణం పేరుతో మోసగించిన సైబర్ నేరగాళ్లు

ప్రజాశక్తి - భోగాపురం

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం, పోలీసులు, బ్యాంకులు చెబుతున్నాసరే చదువుకున్నవారు, ఉద్యోగస్తులు మోసపోతూనే ఉన్నారు. విదేశాలకు తక్కువ ఖర్చుతో వెళ్లేందుకు రాయితీ కల్పిస్తామని చెప్పడతంతో నిజమేనని అనుకుని చాలా మంది వీసా, పాస్‌పోర్టుల కోసం భారీ మొత్తంలో నగదును సైబర్ నేరగాళ్లకు ముట్టజెప్పి నష్టపోతున్నారు. సరిగ్గా అలాంటి ఘటనే మండలంలో చోటు చేసుకుంది. ఏకంగా ఆర్మీ జవాను నుంచే సైబర్ నేరగాళ్లు రూ. 17లక్షలు కొట్టేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చును. పోలీసులు అందించిన వివరాలు మేరకు.. పోలిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగికి సెప్టెంబరులో సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. మీరు కుటుంబంతో కలిసి విదేశాలు వెళ్లేందుకు రాయితీ కల్పిస్తామన్నారు. మీతో పాటు మరో ఫ్యామిలీని కూడా తీసుకొని వెళ్లవచ్చనని చెప్పారు. దీనికి గాను 75 శాతం కంపెనీ భరిస్తుందని, 25 శాతం చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికారు. నిజమేనని ఆ ఆర్మీ ఉద్యోగి అనుకున్నాడు. వెంటనే దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఆధార్‌కార్డు, ఫొటోలు పంపించాలని కోరారు. వీసా కోసం ఇబ్బందులు ఉన్నాయని అందుకు కొంత సొమ్ము చెల్లించాలని కోరడంతో ముందుగా వెయ్యి రూపాయలు వేశారు. అక్కడ నుంచి విడతల వారీగా సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి ఫోన్‌పే ద్వారా, యోనో యాప్ ద్వారా ఏకంగా రూ.17 లక్షలు పంపించాడు. వేసిన సొమ్ము తిరిగి ఇవ్వాలని కోరగా ఇవ్వలేదు. దీంతో మోసపోయానని తెలుసుకొని చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆటో స్టాండ్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని తీరప్రాంతమైన ముక్కాం గ్రామంలోని ఆటో స్టాండ్ పై భోగాపురం ఆటో స్టాండ్‌కి చెందిన ఆటో డ్రైవర్లు ఎస్ఐ కృష్ణమూర్తికి శనివారం ఫిర్యాదు చేశారు. భోగాపురం ఆటో స్టాండ్‌లో ఉన్న ప్రయాణికులను ముక్కాం గ్రామానికి చెందిన ఆటో స్టాండ్ డ్రైవర్లు ఎక్కించుకొని తీసుకుని వెళ్ళిపోతున్నారని అన్నారు. దీంతో స్టానికంగా సీరియల్‌లో పెట్టుకున్న ఆటో డ్రైవర్లకు ప్రయాణికులు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అలా ఎక్కించవద్దని ప్రశ్నిస్తే తిరగబడి కొట్లాటకు దిగుతున్నారని అన్నారు. ఎక్కించవద్దన్నందుకు ఇద్దరు డ్రైవర్లను సైతం కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎద్దు అప్పారావు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.